విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన భోజనం అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సరఫరా అవుతోన్న సాధారణ బియ్యం స్థానంలో త్వరగా ఉడికే, నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో గురువారం నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం 2,599 పాఠశాలలు, 153 హాస్టళ్లకు కలిపి 655 టన్నుల సన్న బియ్యం ఇప్పటికే సరఫరా పూర్తయిందన్నారు. బియ్యం సరఫరాలో పారదర్శకత కోసం 'ట్రేసబిలిటీ' విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఏ మిల్లులో బియ్యం ఆడించారు, ఏ పాఠశాల, హాస్టల్‌కి పంపారన్న వివరాలన్నీ క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.

అటకెక్కిన హామీలు

- అడుగు ముందుకు పడని సాగునీటి ప్రాజెక్టులు
- అమలు కాని ఐటిడిఎ, జీడి మద్దతు ధర హామీలు
- వంశధార నిర్వాసితులకూ అమలు కాని వాగ్దానం
- ఇదీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తీరు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 12వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతోంది. ప్రజాగళం సభల్లో జిల్లాకు సంబంధించి అనేక హామీలు ఇచ్చారు. వీటితోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆ ప్రాంతాలకు సంబంధించి పలు వాగ్దానాలు చేశారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, జీడిపిక్కలకు మద్దతు ధర, బోర్డు ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి అనేక వాగ్దానాలు గుప్పించారు. వాటిలో ఒక్కటీ నెరవేరలేదు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినా, ఆ దిశగా ఒక్క అడుగు పడలేదు. ఉద్దానానికి శుద్ధ జలాల హామీ కూడా అటకెక్కింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పాతపట్నంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు (ఫైల్)

ప్రజాగళం యాత్రలో భాగంగా గతేడాది ఏప్రిల్ ఏప్రిల్ 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలుత పలాసలో బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభలో జిల్లాకు సంబంధించి ప్రధాన అంశాలను ప్రస్తావించారు. జీడి రైతులకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు దక్కాల్సి ఉండగా, రూ.ఏడు వేలే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటకు మద్దతు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఏడాది కాలం గడచినా దానిపై ఒక్క అడుగూ పడలేదు. ప్రభుత్వ నిర్ణయంతో సత్వరం అమల్లోకి వచ్చే ఇటువంటి అంశాన్ని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నాన్చుతోంది. ఇదే సభలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా, ఇప్పటివరకు దాని ఊసే లేదు. ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ కలెక్టరేట్, మండల కేంద్రాల్లో సైతం ధర్నాలు చేసినా ఫలితం కనిపించలేదు.

అడుగుపడని సాగునీటి ప్రాజెక్టులు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని చంద్రబాబు చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నాటికి 38 శాతం పనులు పూర్తి కాగా, ఏడాదిలో ఏడు శాతమే పూర్తయ్యాయి. వంశధార, బాహుదా నదులను అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు వంశధార నీటిని అందిస్తామని వాగ్దానం చేశారు. అనుసంధాన పనులపై ప్రతిపాదనలు పంపాలని కనీసం సూచించలేదు. వంశధార ఆధునీకరణ పనులు చేస్తామని చెప్పినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. వంశధార ప్రాజెక్టుకు జగన్ ఐదేళ్ల పాలనలో పూర్తి చేయలేకపోయారంటూ గతేడాది ఏప్రిల్ 23న పాతపట్నంలో నిర్వహించిన ప్రజాగళం సభలో నాటి ప్రభుత్వాన్ని విమర్శించారు. వంశధార ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికీ 93 శాతం పనులే పూర్తయ్యాయి.

ఉద్దానానికి అందని శుద్ధజలాలు

ఉద్దానం ప్రాంతంలో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించడంతో పాటు ఇక్కడి పంటలపై పరిశోధన చేయించి కిడ్నీ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. పలాసలో నిర్మించిన కిడ్నీ సూపర్ స్పెషాలిటీ, రీసెర్చ్ ఆస్పత్రి నామమాత్రపు సేవలకే పరిమితమైంది. రీసెర్చ్ సెంటర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎనిమిది రీసెర్చ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కనీసం ఫార్మాసిస్టులనూ నియమించలేదు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని 807 గ్రామాలకు తాగునీరందించాలని నిర్ణయించినా ఇప్పటివరకు 220 గ్రామాలకే నీరందిస్తున్నారు.

నిర్వాసితులకు ఏదీ న్యాయం?

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం భూసేకరణ చట్టం-2013 అమలు చేయకుండా రూ.ఐదు లక్షల ప్యాకేజీతో సరిపెట్టింది. నిర్వాసితులకు టిడిపి అన్యాయం చేసిందని, తాము అధికారంలోకి వస్తే 2013 చట్టం అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2022 జూన్‌లో రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లించి చేతులు దులుపుకుంది. జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలనకు 2024లో కొత్తూరు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేస్తానంటూ హామీనిచ్చారు. ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఎంత మేలు చేకూరుతుందో, వాటి కోసం భూములు ఇచ్చి నష్టపోయిన రైతులకూ పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని, ఆ బాధ్యత తాను తీసుకుంటానంటూ పాతపట్నంలో నిర్వహించిన సభలోనూ మాట ఇచ్చారు. ఏడాది గడిచినా అమలుకు నోచుకోలేదు.

మోగనున్న బడి గంట

నేడు పాఠశాలల పున:ప్రారంభం

ప్రజాశక్తి - టెక్కలి



49 రోజుల తర్వాత బడి గంట నేడు మోగనుంది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి ఈనెల 11వ తేదీ వరకు వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి ఎప్పట్లానే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం తొమ్మిది నుంచి 3.40 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమై నాలుగు గంటలతో ముగియనున్నాయి. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత పాఠశాలలు 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు 398 ఉన్నాయి. వాటిలో ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ 394, సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ నాలుగు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 2.90 లక్షల పైబడి విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంతో కొత్త ఉపాధ్యాయులతో ఈ విద్యా సంవత్సరం ఆరంభం కానుంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలలకు సరఫరా చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అందించే యూనిఫారాలు కూడా మారనున్నాయి. మధ్యాహ్న భోజన పథకంలో భోజనం నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం సన్నబియ్యం అందజేస్తోంది. విద్యార్థులకు పౌష్టికాహారం ఆందించేందుకు ఆవసరమైన రాగిజావ పౌడర్, బెల్లం ప్యాకెట్లలో మార్పులు చేసి కొత్త రకం ప్యాకింగ్‌తో పాఠశాలలకు పంపిణీ చేశారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

కోటబొమ్మాళి: విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలకరికి సన్నద్ధమవుతున్న రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయం లాభదాయకంగా ఉండాలని ఆకాంక్షిచారు. ఈనెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది వరుణుడు కూడా కరుణించి ముందుగానే వర్షాలు కురవడంతో ఖరీఫ్ సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అన్నదాతలకు ముందుగానే వ్యవసాయ యాంత్రీకరణతో పాటు భూసార పరీక్షలు కూడా నిర్వహించి రైతులకు వారి భూ సంబంధిత ఆరోగ్య పత్రాలను అందజేసి, భూసారాలను తెలుసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

బిజెపితో దేశానికి ప్రమాదకరం

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ
- టిడిపి, వైసిపి మోడీ చేతిలో కీలుబొమ్మలు
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధానాలను అనుసరిస్తున్న బిజెపితో దేశానికి ప్రమాదకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సిపిఐ 25వ జిల్లా మహాసభ సందర్భంగా పాతపట్నంలోని గిరిజన సహకార గోడౌన్ సమీపాన సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కార్మికుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న ఎన్నో చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తూ ఓట్ల కోసం మోడీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. 2026 నాటికి నక్సలిజం లేని దేశాన్ని చేస్తామంటున్న మోడీ, అమిత్ షాలు నరమేధం సృష్టించి ఎందరో సిద్ధాంతవాదులను పొట్టన పెట్టుకుంటున్నారని చెప్పారు. టెర్రరిస్టులతో కాల్పుల విరమణ ప్రకటించిన బిజెపి, దేశ ప్రజల కోసం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పోరాడుతున్న నక్సలైట్లతో కాల్పుల విరమణకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. నక్సలిజం లేని దేశాన్ని తయారు చేయడం పక్కనపెట్టి నిరుద్యోగం లేని దేశాన్ని తయారు చేయాలని హితవు పలికారు. బిజెపి విధానాలను ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెడుతున్నారని, న్యాయవ్యవస్థలపై కూడా దాడులు చేసేంత దుర్మార్గపు స్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. నక్సలైట్లు వారి పంథాను మార్చుకుని కమ్యూనిస్టులతో కలిసి వస్తే ఎర్రజెండాలు ఏకమై బిజెపి ప్రభుత్వాన్ని పారదోలుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాలు మోడీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మోడీని ప్రశ్నించడం మర్చిపోయారని విమర్శించారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వంశధార నదిపై నిర్మించి తలపెట్టిన నేరడి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని, ఆంధ్రప్రదేశ్‌కు ఒడిశాతో ఉన్న జల సమస్యల పరిష్కారానికి ఇదే సరైన సమయమన్నారు. ఇరు రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయన్నారు. జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో వచ్చిన ఎండియు ఆపరేటర్లను ఓటమి ప్రభుత్వం తొలగించడం భావ్యం కాదని, వారి కాంట్రాక్టు ఉన్నంత వరకు వారిని కొనసాగించాలన్నారు. అంతకుముందు స్థానిక సెయింట్ ఆన్స్ కాన్వెంట్ స్కూల్ నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందరలాల్, సనపల నరసింహులు, ఎస్.నారాయణస్వామి, ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అభివృద్ధే లక్ష్యం

- ఏడాది పాలనలో ఎన్నో చేశాం
- శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును పూర్తి చేశాం
- త్వరలోనే కోడి రామ్మూర్తి స్టేడియం పూర్తి
- నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని, ప్రాధాన్యతా క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తూ ముందుకు సాగుతానన్నారు. నియోజకవర్గ సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నేటితో ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

? ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులు, పరిష్కరించిన ప్రధాన సమస్యలు ఏమిటి?

శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి దారుణంగా ఉండేది. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, మరణాలు సంభవించినా గత పాలకుల్లో కనీస చలనం లేకుండా పోయింది. ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేశాం. కాంట్రాక్టర్‌కు నిధుల సమస్య లేకుండా చర్యలు తీసుకున్నా. రూ.16.50 కోట్లు మంజూరుకు కృషి చేశాను. ఈ రోడ్డు నిర్మాణం పూర్తితో ప్రధాన సమస్యకు పరిష్కారం చూపినట్లయింది. అరసవల్లి రథసప్తమి వేడుకను రాష్ట్ర పండగగా చేశాం. రూ.నాలుగు కోట్లతో సుందరీకరణ చేశాం. ఒక్కరోజులో 1.40 లక్షల మంది సందర్శకులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకున్నారు. జిల్లా చరిత్రలో ఇది నిలిచిపోయే అంశం. శ్రీకాకుళం నగరంలో సుందరీకరణకు 88 పనులు ప్రారంభించి 60 పనులు పూర్తి చేశాం.

? కోడి రామ్మూర్తి స్టేడియం పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు?

కోడి రామ్మూర్తి స్టేడియం పనులకు సంబంధించి రీటెండరింగ్ పూర్తి చేశాం. రూ. 5.50 కోట్లతో పనులు ప్రారంభించాం. కొన్ని నెలల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. స్టేడియం పనులు పూర్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాను.

? సాగునీటి సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టారు?

రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. 4,800 ఎకరాలకు సాగునీటి ఇబ్బంది లేకుండా కాలువల్లో ఉపాధి హామీ కింద పూడికలు తీశాం. గతంలో నిధులు విడుదలై నిలిచిపోయాయి. ప్రసుత్తతం నిధుల మంజూరుకు కృషి చేస్తున్నాను. నియోజకవర్గంలో శాశ్వత సాగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

? సాగర తీరం కోత నివారణకు, మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

గార మండలంలోని కళింగపట్నం, శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేటలో సముద్ర తీరం కోతకు గురవుతోంది. కోత నియంత్రణకు రాతి కట్టడాలు, ఇతర చర్యలు అవసరం. ఈ సమస్యను ఎన్‌సిసిఆర్, సిఐసిఎఫ్ సంస్థల దృష్టికి తీసుకెళ్లాను. దీనిపై ప్రత్యేక దృష్టిసారించాను. కళింగపట్నంలో మినీ జెట్టీలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మౌలిక వసతులకు సంబంధించి ప్రధానంగా రోడ్ల నిర్మాణాలపై దృష్టిసారించాను. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో రోడ్లు నిర్మిస్తున్నాం. రూ .70 కోట్లతో 45 కిలోమీటర్ల సిసి రోడ్లు, ఎనిమిది కి.మీ బిటి రోడ్లు నిర్మించాం. గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. సింగుపురంలో నర్సింగ్ కళాశాల భవనాల పూర్తికి కృషి చేస్తున్నాను. ఆరు నెలల్లో ఈ భవనాలు పూర్తవుతాయి.

? మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం, కళింగపట్నం ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం, శ్రీకాకుళం నగరంలో రోడ్డు విస్తరణలు, నగర సుందరీకరణ పనుల పూర్తి, పూర్తిస్థాయిలో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడం. ముఖ్యంగా మత్స్యకార గ్రామాలు, తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతాను. ఔటర్ రింగు రోడ్డు వంటి లక్ష్యాలు ఉన్నాయి. పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్, నగరపాలక సంస్థ కార్యాలయం సుందరీకరణ అవసరం. డచ్ బిల్డింగ్ వద్ద అర్బన్ ఫారెస్టుగా మార్చి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది.

పుస్తకాల పేరుతో 'కేశవరెడ్డి' దోపిడీ

చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని అరసవిల్లి జంక్షన్, ఎచ్చెర్లలోని కేశవరెడ్డి విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫారాలు అమ్ముతున్నా విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు విమర్శించారు. నగరంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విద్యాసంస్థలకు దాసోహమైందన్నారు. విద్యాశాఖ అధికారులు మంత్రి నారాయణ విద్యాసంస్థల వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు. మంత్రి విద్యాసంస్థలను తామేం చేయగలమన్న ధోరణిలో విద్యాశాఖ అధికారులు ఉన్నారు తప్ప, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామని ఆలోచించడం లేదన్నారు. నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు నడుపుతున్నారా? లేదా? చూడాల్సిన అధికారులే చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలకు అదేశించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణలో రాజకీయ జోక్యం తగ్గాలని, నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు విక్రయిస్తున్న, అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితాను విడుదల చేయాలన్నారు. లేకుంటే డిఇఒ కార్యాలయం వద్ద నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.336 కోట్లు

ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: టిడిపి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధికి రూ.336 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే, పియుసి ఛైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలనకు ప్రజలు చరమగీతం పాడి అభివృద్ధి నిర్దేశకుడు చంద్రబాబునాయుడుని నమ్మి టిడిపి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ఈ ఏడాది పాలనలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా అభివృద్ధి పనులకు రూ.51 కోట్లు, ఆర్అండ్‌బి ద్వారా రూ.30 కోట్లు, ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు రూ.159 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, పలు అభివృద్ధి పనులకు రూ.75 కోట్లు, గిరిజన ప్రాంతాల రోడ్లకు రూ.నాలుగు కోట్లు, రైతులకు సాగునీరు అందించే వంశధార కాలువ అభివృద్ధి పనులకు సుమారు రూ.రెండు కోట్లతో పాటు మోడల్ స్కూల్ అభివృద్ధి, కెజిబివి అదనపు భవనాల నిర్మాణాలు, మరికొన్ని అభివద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్య పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని కోరారు.

రూ.రెండు కోట్ల ఫార్మా ప్రొడక్టు రికవరీ

- రెడ్డీస్ లేబొరేటరీస్ చోరీ కేసు చేధించిన పోలీసులు
- ఎనిమిది మంది నిందితుల అరెస్టు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం పైడిభీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఫార్మా ప్రొడక్టు చోరీ కేసును పోలీసులు ఛేధించారు. సుమారు రూ.రెండు కోట్ల విలువ చేసే 460 గ్రాముల ఫార్మా ఉత్పత్తిని రికవరీ చేయడంతో పాటు ఇందులో ప్రమేయం ఉన్న ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి వెల్లడించారు. తమ కంపెనీలో సెమాగ్లుటైడ్ అనే ఫార్మా ప్రొడక్టు తస్కరణకు గురైనట్లు డా.రెడ్డీస్ లేబొరేటరీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలతో మూడు నెలల పాటు విచారణ చేపట్టామని తెలిపారు. ఈ ఫార్మా ప్రొడక్టును డయాబెటిస్ టైప్-2, దీర్ఘకాలిక బరువు నియంత్రణకు ఉపయోగిస్తారని, మార్కెట్‌లో మంచి రేటు ఉందన్నారు. ఈ ఔషధానికి రెడ్డీస్ లేబొరేటరీస్‌కు తప్ప దేశంలో ఏ కంపెనీకి అనుమతి లేదని, దీన్ని విదేశాలకు అమ్మి, డబ్బులు సంపాదించేందుకు కంపెనీలో పనిచేస్తున్న కొందరు, హైదరాబాద్‌కు చెందిన వారితో చేతులు కలిపారని వెల్లడించారు. ఈ దొంగతనంలో మొత్తం ఎనిమిది మంది నిందితులు భాగస్వాములైనట్లు గుర్తించామని, ఇందులో నలుగురు నిందితులు అదే కంపెనీలో (డా.రెడ్డీస్) పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు. కంపెనీలో సిటిఒ 6, ఎఫ్‌జి వేర్‌హౌస్ వద్ద పనిచేసే సురేష్ రాఘవేంద్ర, అప్పలనాయుడు, కాంతారావు అనే నలుగురు ఉద్యోగుల ప్రమేయమున్నట్లు తేలిందన్నారు. రాఘవేంద్ర అనే వ్యక్తి ఆ ప్రొడక్టుని దొంగతనం చేసి అప్పలనాయుడుకు, అప్పలనాయుడు ద్వారా సురేష్‌కు అమ్మాలని నిర్ణయించారని తెలిపారు. విశాఖ జిల్లా దువ్వాడలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో పనిచేస్తున్న కాంతారావుకు ఈ ఉత్పత్తిని చేరవేశాడని తెలిపారు. కాంతారావు హైదరాబాద్‌లో గల ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న తిరుపతి అనే వ్యక్తికి ఈ ప్రొడక్ట్ అందించి, విక్రయించాలని సూచించినట్లు వెల్లడించారు. నిర్ణీత సమయంలో తిరుపతి విక్రయించకపోవడంతో మరో వ్యక్తి జి.సురేష్‌రెడ్డికి ఇచ్చారన్నారు. సురేష్ రెడ్డి అరబిందో కంపెనీలో పనిచేస్తున్న సమయంలో పెల్లాడియం అసిటెట్ అనే ప్రొడక్ట్ దొంగతనం కేసులో అరెస్టు అయ్యారని తెలిపారు. సురేష్ రెడ్డి కూడా నిర్ణీత సమయంలో అమ్మలేకపోవడంతో వీరు బాలకృష్ణ, నవీన్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ పంపి ప్రొడక్టు తీసుకుని రావాలని పురమాయించినట్లు వివరించారు.

నిందితులను మోసం చేసిన మరో నిందితుడు

ఒరిజినల్ ప్రొడక్ట్‌ను సురేష్ రెడ్డి ఉంచుకొని, డూప్లికేట్ ప్రొడక్ట్‌ను వాళ్లకు అప్పగించినట్లు తెలిపారు. ఒరిజినల్ ప్రొడక్ట్‌తో పాటు డూప్లికేట్ ప్రొడక్ట్‌ను అమ్ముతున్న క్రమంలో ఎనిమిది మందిని అరెస్టు చేశామని తెలిపారు. వీరు గతంలో అదే కంపెనీలో పెల్లాడియం అసిటెట్ కెమికల్ ప్రొడక్టు సుమారు 3.38 కేజీలను దొంగతనం చేశారని, వీటి విలువ రూ.60 లక్షలు ఉంటుందని తెలిపారు. దీన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి, రెండు కోట్ల విలువైన 450 గ్రాముల సెమాగ్లుటైడ్ పూర్తిగా రికవరీ చేశామని తెలిపారు. పరిశ్రమల్లో అంతర్గతంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వరరావు

ప్రతిభకు ప్రశంస

ఫార్మా ప్రొడక్ట్ చోరీ కేసును అతి తక్కువ కాలంలో ఛేధించి నిందితులను పట్టుకోవడంలో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద పర్యవేక్షణలో చాకచక్యంగా వ్యవహరించిన జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐలు చిరంజీవి, లక్ష్మణరావు, పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

BOTH NAMES ARE ONE AND THE SAME

Undersigned **ESURU HARI KRISHNA @ ISURU HARIKRUSHNA,** S/o Late ESURU BHIMAIYA REDDY, Kondi Veedhi, R.Belagam Village and Post, Kaviti Mandal. Srikakulam District, Pin Code No.532 290, Andhra Pradesh., In my Aadhar Card, service book of my father, and other documents my name mentioned as **ESURU HARI KRISHNA.** In disability certificate my name is entered as **ISURU HARIKRUSHNA** Both these names **ESURU HARI KRISHNA** and **ISURU HARIKRUSHNA** belongs to me and they are one and the same for all purposes.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA. I.A.109/2024 in O.S.4/2021.

Between:
1. Bendalam Kamalamma (died)
2. Bendalam Tejeswara Rao
And others. ...Petitioners/Plaintiffs Proposed Plaintiffs 2 to 6.
And:
1. Barla Mohana Rao (died),
2. Pondala Kamaraju And others.
....Respondents/Proposed Respondents/Defendants
To
R-4: Bendalam Jaggamma, W/o Hemaraju, aged 65 years, Hindu, house-hold duties, resident of Door No.2-15, Palasapuram village, Sompeta Mandal, Srikakulam Dist.

Please take notice that the above named petitioners filed a petition to set-aside the default order dated **06-02-2024** passed in the above suit and it stands posted to **29-06-2025 at about 10-30 A.M.** in the above court for your appearance, you appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

//BY ORDER//

V. DHARMA RAO,
ADVOCATE,
SOMPETA, CELL: 8247207896.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA. I.A.110/2024 in I.A.12/2024 O.S.4/2021.

Between:
1. Bendalam Kamalamma (died)
2. Bendalam Tejeswara Rao
And others. ...Petitioners/Plaintiffs Proposed Plaintiffs 2 to 6.
And:
1. Barla Mohana Rao (died),
2. Pondala Kamaraju And others.
....Respondents/Proposed Respondents/Defendants
To
R-4: Bendalam Jaggamma, W/o Hemaraju, aged 65 years, Hindu, house-hold duties, resident of Door No.2-15, Palasapuram village, Sompeta Mandal, Srikakulam Dist.

Please take notice that the above named petitioners filed a petition to set-aside the default order dated **06-02-2024** passed in the above petition I.A.12/2024 which is filed for adding the L.Rs. of the deceased plaintiff in the above suit and it stands posted to **29-06-2025 at about 10-30 A.M.** in the above court for your appearance, you appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

//BY ORDER//

V. DHARMA RAO,
ADVOCATE,
SOMPETA, CELL: 8247207896.

మాట్లాడుతున్న జెడి త్రినాథస్వామి

అధిక లాభాలు వచ్చే పంటలపై దృష్టి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అధిక లాభాలు వచ్చే పంటలపై రైతులు మగ్గుచూపాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని చిట్టివలస గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, అందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఇతర రాయితీలను ప్రభుత్వం నుంచి అందిస్తామని తెలిపారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ మాట్లాడుతూ రైతులు నికర ఆదాయం పెంపొందించేందుకు ఇతర పంటలు వైపు మొగ్గు చూపించాలన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు కావాల్సిన యంత్ర పరికరాలను, ఇతర సదుపాయాలను కల్పిస్తామని రైతులకు సూచించారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అందిస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, సర్పంచ్ మాజీ సభ్యులు సంబాళ్ల శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, టెక్కలి ఎడిఎ బి.వి.తిరుమలరావు, ఎఒ ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

దాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పాడి అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి - జలుమూరు

పాడి పంట అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు పశువుల ఆసుపత్రి పరిధిలోని లబ్ధిదారులకు పశువుల దానా కట్టి, బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం రాయితీతో కూడిన పశువుల దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దాణాలు, మందులు, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, మునుకోటి దామోదరావు, సర్పంచ్ పంచిరెడ్డి రాంరంద్రరావు, దుంగ స్వామిబాబు, తమ్మన్న సతీష్ పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

పొందూరు: పొందూరు మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో 7,8,9వ తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ హెచ్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఖాళీగా ఉన్న తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ ఇచ్చారు... తొట్టె మరిచారు!

- ఐదు నెలలుగా షెడ్డులోనే...
- ఉద్యోగులకు తప్పని తిప్పలు

కొర్లాంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

ప్రజాశక్తి- కవిటి, సోంపేట

పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఈ ఏడాది జనవరిలో జిల్లా వ్యాప్తంగా సుమారు 102 పంచాయతీలకు ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్లు ఐదు నెలలుగా రేకుల షెడ్లు, చెట్ల నీడల్లో మగ్గుతున్నాయి. కేవలం ట్రాక్టర్ అందజేసి, తొట్టె ఇవ్వకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఉదాహరణకు కవిటి మండలంలో మాణిక్యపురం, నెలవంక, లండారిపుట్టుగ, కపాసుకుద్ది, సహలాలపుట్టుగ, జగతి, బెలగాం పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. అదేవిధంగా ఇచ్ఛాపురం మండలంలో కేసిపురం, మండపల్లి, సోంపేట మండలంలో కొర్లాం, బేసిరామచంద్రపురం, పలాసపురం, మామిడిపల్లి, ఇప్పలాం పంచాయతీలకు ట్రాక్టర్లు అందించారు. ప్రస్తుతం అవి దుమ్ము, ధూళితో మూలన ఉన్నాయి. ఇలాగే మరికొన్ని నెలలు మూలన ఉంటే ఇంజిన్‌లో లోపాలు ఏర్పడడమే కాకుండా సాంకేతిక సమస్యలు కూడా కలుగుతాయని అటు పంచాయతీ పాలక వర్గాలు, ఇటు ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఉద్యోగులకు తప్పని తిప్పలు

కేవలం ట్రాక్టర్ మాత్రమే ఇచ్చి తొట్టె ఇవ్వకపోవడంతో ఆయా పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు స్థానికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్ ఉంచేందుకు స్థలం లేకపోవడంతో అందుబాటులో ఉంటున్న స్థానికుల ఇళ్ల వద్ద కానీ స్థానిక నాయకుల ఇళ్ల వద్ద కానీ ట్రాక్టర్లు పెట్టడంతో ప్రత్యర్థులు ఆరోపణలు చేస్తున్నారు. నాయకులు సొంత పనులకు ట్రాక్టర్ వాడుతున్నారని, ఉద్యోగులు వారికి సహకరిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. దీంతో ఉద్యోగులకు ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. దీంతో తొట్టె ఎప్పుడు వస్తుందో? తమ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో అని పంచాయతీ సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

తొట్టె ఉంటే ఎంతో ఉపయోగం

ప్రభుత్వం పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్ మంజూరు చేసే ఎంతో సంతోషించాం. కానీ, ఆ సంతోషం ఎన్ని రోజులు నిలవలేదు. కేవలం ట్రాక్టర్ మాత్రమే ఇచ్చి తొట్టె ఇవ్వకపోవడంతో గత ఐదు నెలలుగా ట్రాక్టర్ షెడ్డులోనే ఉంది. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి తొట్టె అందిస్తే పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు ఎంతో మేలు జరుగుతుంది.

- దుర్గాసి గౌతమిరెడ్డి, సర్పంచ్, నెలవంక

ప్రతిపాదనలు పంపించాం

జనవరిలో పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లకు సంబంధించిన కొన్ని అనివార్య కారణాల వల్ల తొట్టెలు రావడం ఆలస్యమైంది. వీటికి సంబంధించిన ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు కూడా పంపించాం. వచ్చిన వెంటనే పంచాయతీలకు అందిస్తాం.

- భారతీ సౌజన్య, జిల్లా పంచాయతీ అధికారి

మాన్యువల్ కౌన్సెలింగ్‌లోనూ ఇబ్బందులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఐక్య ఉపాధ్యాయ వేదిక పోరాటం నేపథ్యంలో ఎట్టకేలకు ప్రభుత్వం ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ మాన్యువల్ పద్ధతిలో నిర్వహిస్తుంది. శ్రీకాకుళం రూరల్ మండలం గాయత్రి కళాశాలలో బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్ సాయంత్రం వరకు సాగింది. మొదటి రోజు 543 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో మున్సిపాలిటీ, ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,300 వరకు ఎస్‌జిటి ఉపాధ్యాయులు ఉన్నారు. మరో ఆరో రోజుల పాటు కౌన్సెలింగ్ కొనసాగే అవకాశం ఉంది. మాన్యువల్ కౌన్సెలింగ్‌లోనూ కొన్ని సమస్యలు అధికారుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. పరిష్కార మార్గం సైతం లభించపోవటతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా జిల్లా యూనిట్‌గా కౌన్సెలింగ్ నిర్వహించడం లేదన్నారు. పనిచేస్తున్న స్థానంలోని సమీప మండలాల్లో మాత్రమే స్థానాలు చూపిస్తున్నారు. దీంతో ఉపాధ్యాలు సినియారిటీ ఉన్నా... తాము కోరుకున్న పాఠశాల ఎంచుకునే అవకాశం అభించటం లేదు. మో పక్క స్పౌజ్ కోటాలో సైతం తమకు అవసమైన పాఠశాలలు లభించటం లేదు. దీంతో ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క కౌన్సెలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించ లేదు. తాగునీరు, భోజనం వంటి వాటికి కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకు వెళ్లినా స్పందన లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిఇఒ తిరుమల చైతన్యతో కూడిన అధికారులు కౌన్సెలింగ్ పర్యవేక్షించారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రిన్సిపాల్‌గా పద్మావతి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైడి పద్మావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా చేరిన వై.శ్రీనివాసరావు శాఖాపరమైన బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా గుర్ల కళాశాలకు బదిలీ అయ్యారు. 2001లో ఎపిపిఎస్‌సి ద్వారా పౌరశాస్త్ర అధ్యాపకురాలిగా ఎంపికైన పద్మావతి వంగర, తొగరాం, మెళియాపుట్టి, కింతలి, పొందూరు కళాశాలల్లో పనిచేశారు. మెళియాపుట్టి ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొంది, శాఖాపరమైన బదిలీల్లో భాగంగా సరుబుజ్జిలి వచ్చారు. ప్రిన్సిపాల్‌ను సర్వ శిక్ష అభయాన్ ఎపిసి శశిభూషణ్, అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆకెళ్ల రామారావు, రమేష్ సాహు, వినోద్ రాజు, గొండు శ్రీనివాసరావు, విజయ్, స్టేట్ మీడియా కన్వీనర్ దుగ్గివలస రాంప్రసాద్, డిఆర్ సంఘం ప్రతినిధి సోపేటి రమేష్, ప్రిన్సిపాళ్లు మరపట్ల పవన్, గణపతి ధనంజయరావు, జి.తిరుపతిరావు, యుడిసి రమేష్ అభినందించారు.

తోట పంటలపై దృష్టి

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులకు ఆదాయం చేకూర్చే తోట పంటలపై దృష్టి సారించాలని డాక్టర్ వి.హరికుమార్ సూచించారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, శ్రీకాకుళం వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో తోటలో వేసుకోవాలని సూచించారు. భారతీయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ ఆనందితపాల్ మాట్లాడుతూ సమతుల ఎరువుల యాజమాన్యం, కలుపు, పురుగు మందులు వాడకం ద్వారా భూమి ఆరోగ్యం పెంచుకోవచ్చు అని తెలియజేశారు. శాస్త్రవేత్త డాక్టర్ వై.సంధ్యారాణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు యాజమాన్యం, రకాల ఎంపిక, చీడపీడలు వాటి యాజమాన్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్డికపేట సర్పంచ్ ఆర్.రవీందర్‌రెడ్డి, పట్నాన షణ్ముఖరెడ్డి, అర్రా కుమార స్వామి, విఎఎ వి.హారిక, హెచ్‌ఇఒ ఆమని పాల్గొన్నారు.

బూర్జ : బూర్జలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, వాణిజ్య పంటల పరిశోధన స్థానం రాజమండ్రి నుండి శాస్త్రవేత్త శైలజ వరిలో వచ్చే చీడపీడల సమగ్ర నియంత్రణ, మట్టి పరీక్షల ప్రాముఖ్యత, ఎరువుల సరైన వినియోగం గురించి రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, సర్పంచ్ ఏగు అనురాధ, ఎంపిటిసి పోలినాయుడు, వేపారి వెంకటేష్, కత్తెర అశోక్, విఆర్‌ఒ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనూష

గాయపడిన వ్యక్తి మృతి

పాతపట్నం : పాతపట్నం మండలం కాగువాడకు చెందిన అగూరి కేశవరావు (41) ఈ నెల 9న రాత్రి తన గ్రామంలో రోడ్డుపై నడుస్తుండగా గంగుపేట నుంచి బూరగం వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య ఉషాకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన ట్రాక్టర్

తప్పిన ప్రమాదం

లావేరు: మండలంలోని జాతీయ రహదారి బెజ్జిపురం కూడలి సమీపంలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక ట్రాక్టరు నుజ్జునుజ్జు కాగా, మరో ట్రాక్టరు, ద్విచక్ర వాహనం దెబ్బతిన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుతున్న లారీ బెజ్జిపురం కూడలి సమీపంలోని సర్వీసు రోడ్డులో టైర్లకు గాలి పెట్టేందుకు ఆగి ఉన్న ట్రాక్టర్లపైకి ఒక్కసారి దూసుకెళ్లింది. లారీ దూసుకురావడంతో సమీపంలో ఉన్న వారంతా భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఒక ట్రాక్టర్ పూర్తిగా నుజ్జవ్వగా, మరో ట్రాక్టరు, ద్విచక్ర వాహనం దెబ్బతిన్నాయి. ప్రమాదం సంభవించిన సమయంలో ట్రాక్టర్లవద్ద ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంపై ట్రాక్టరు డ్రైవర్ జె.శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన

టెక్కలి రూరల్ : మీడియాపై దాడులు ఖండించాలని టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం కొవ్వొత్తులు చేతబట్టి నిరసన తెలిపారు. సాక్షి కార్యాలయాలపైన, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు, ఫోర్త్ ఎస్టేట్ అయినా మీడియాపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. మీడియాను సంరక్షించాల్సిన ప్రభుత్వాలే దాడులను ప్రోత్సహించడం తగదని అన్నారు. శ్రీనివాసరావు బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు రమణ, ఈశ్వరరావు, రాజశేఖర్, భాస్కరరావు, ప్రసాదరావు రంగబాబు, పాపారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అర్చన

మహిళల బలోపేతమే లక్ష్యం

నరసన్నపేట : మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన అన్నారు. మండల మహిళా అధ్యక్షులు పూచ్చల కల్పన అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య సమావేశంలో బుధవారం నిర్వహించారు. ముందుగా కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతికి, అభివృద్ధికి, ఆర్థికంగా ఎదుగుదాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని అన్నారు. డ్వాక్రా సంఘాలు ద్వారా వచ్చిన లబ్ధిని వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, మాజీ అధ్యక్షులు బలగ భారతి, సంతోసి, గుణుపూరు రామలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్రాక్టర్లలో తరలిస్తున్న సన్నబియ్యం

సన్నబియ్యం తరలింపు

లావేరు: గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం పాఠశాలల్లో, వసతిగృహాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాలకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ఒక్కో బస్తాలో 25 కిలోలు చొప్పున సన్నబియ్యం లావేరు మండల పౌరసరఫరాల గోదాంకు 1666 బస్తాలు చేరుకున్నాయి. వాటిని గోదాం నుంచి నేరుగా ఆయా పాఠశాలలు వసతిగృహాలకు సరఫరా అవుతున్నాయి గతంలో గోదాం నుంచి రేషన్ డిపోలకు అక్కడ నుంచి పాఠశాలలుకు సరఫరా అయ్యేవి. ఇప్పుడు అవకతవకలకు ఆస్కారం లేకుండా సన్నబియ్యం సరఫరా పారదర్శకంగా ఉండేలా క్యూ ఆర్ కోడ్‌తో సరఫరా చేస్తున్నారు. లావేరు, రణస్థలం మండలాల్లోని మొత్తం 201 పాఠశాలలకు 18 వసతిగృహాలకు బియ్యం రవాణా అవుతుంది.

45 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నేత్రాలను పరీక్షిస్తున్న అరుణకుమారి

ఆమదాలవలస : పట్టణ శివారున ఉన్న టింపని పాఠశాలలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్, టింపని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి వెంకట నారాయణ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు అరుణకుమారి 40 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 12 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్‌కు పంపించే ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరం లేని రోగులను గుర్తించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

సాక్షి కార్యాలయంపై దాడులు సరికావు

కొత్తూరు: రాష్ట్రంలో కూటమి నాయకులు సాక్షి కార్యాలయలపై దాడులు చేయడం సరికాదని వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎచ్చెర్ల మండలం సాక్షి కార్యాలయంపై టిడిపి నాయకులు ఇటీవల దాడులు చేసి కొత్త సంస్కృతికి తెరలేపారన్నారు. పెద్ద ఎత్తున ఆస్తులు ధ్వంసం చేయడాన్ని ఖడిస్తున్నామన్నారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు అగతముడి నాగేశ్వరరావు, సవర రమేష్, డి.అప్పన్న, పి.అశోక్‌కుమార్, బి.నాగేష్, ఎం.రామారావు ఉన్నారు.

వైభవంగా జగన్నాథ చందనోత్సవం

పాల్గొన్న యాత్రికులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని వైభవంగా జగన్నాథ చందనోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షణలో ఘట్టాలు రెండు గంటల పాటు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలను స్వామివారికి ధరించారు. తులసి, పుష్పమాలలతో అలంకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చు జగన్నాథరెడ్డి, సేవాకర్తలు కాళ్ల శ్రీనివాసరావు, వల్లంపాటి నారాయణమూర్తి, దేవరపల్లి గోపాలరావు, ప్రకాష్‌కుమార్ సాహు, కంఠంశెట్టి రామకృష్ణ, కె.రామకోటి, ధనుషంగ, సిహెచ్.మధు, పొట్టా కిశోర్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

శ్రీకాకుళం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానంగా నగరంలోని నారాయణ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి నారాయణరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బుధవారం రక్తదానంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తలసీమియా, సికిల్‌సెల్, డయాలసిస్ తదితర రోగాలు పెరుగుతున్న నేపథ్యంలో రక్తావసరం రోజురోజుకీ ఎక్కువవుతోందని చెప్పారు. ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అన్ని విభాగాలు కలిసికట్టుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎన్.ఉమాశంకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

మందస : మొక్కను నాటుతున్న గ్రామస్తులు

మందస: ప్రకృతిని కాపాడటానికి ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ సేనాపతి దివ్య అన్నారు. కొత్తపల్లి సచివాలయం, శ్మశాన వాటిక పరిధిలో మర్రి, బాదం, కాము తదితర మొక్కలను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బుధవారం నాటారు. నాటి, వాటి పరిరక్షణ కోసం తగు ఏర్పాట్లు చేస్తామన్నారు. భవిష్యత్‌లో గ్రామం చుట్టు పక్కల మరిన్ని మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సేనాపతి మురళి, కొత్తపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, గవ్వ భీమారావు, పెద్దలు ఎం.హరిబంధు, టి.జగన్నాయకులు, టి.గోపి, ఎస్.హరీష్, ఎం.హేమరాజు, వినయ్ పాణిగ్రహీ పాల్గొన్నారు.

టెక్కలి : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని సిద్ధి వినాయక వాకర్స్ గ్రూప్ నిర్వాహకులు గంగారపు మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మెక్కలు నాటారు. భావితరాల్ని దృష్టిలో పెట్టుకుని మెక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు కర్ణిక గాంధీ, దవళ కృష్ణారావు సిర్ల సూర్యనారాయణ, ప్రదాన హరిశ్చంద్రరావు, ఉత్తరకవాటం గణపతిరావు, ఎర్నాగుల సింహాద్రి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మన ఊరికి మన ఎమ్మెల్యే'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కొండములగాం పంచాయతీలో 'మన ఊరుకి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ముక్తుంపురం, కొండములగాం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లంక శ్యాం, పిషిని జగన్నాథంనాయుడు, పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, ఎం.కనకారావు, బస్వ గోవిందరెడ్డి, దన్నాన సత్తిబాబు, పిషిని ఆసిరినాయుడు, పైడి అప్పడుదొర, తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఆర్ఐ ఎం.సతీష్, ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు పాల్గొన్నారు.

వాకౌట్ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి సభ్యుల వాకౌట్

ప్రజాశక్తి- నౌపడ

తమకు రావాల్సిన గౌరవ వేతనాలను 18 నెలల నుంచి ప్రభుత్వం బకాయి పెట్టినందున సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల తీర్మానాలకు అధికారులు విలువ ఇవ్వడం లేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మెరుగు రాజేశ్వరి అధ్యక్షతన బుధవార మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తమకు ఉన్న అధికారాలు మేరకు అభివృద్ధి పనులకు, పాలనాపరమైన అనుమతులకు తీర్మానాలు చేసి అధికారులకు ఇస్తుంటే... కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని వాపోయారు. పలువురు మండల స్థాయి అధికారులకు ప్రజా ప్రతినిధులు అంటే లెక్కచేయడం లేదని వైసిపి సర్పంచ్ మోహన్‌రెడ్డి, బాబూరావు, ఎంపిటిసిలు సుధాకర్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి కానీ, స్థానిక మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నుంచి గానీ తమ విధులను అడ్డుకోవాలని ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి, ఎంపిపి జయంత్ ప్రసాద్, తహశీల్దార్ బి.హేమసుందర్, వైస్ ఎంపిపి పొందల తులసమ్మ, మేరుగు అప్పారావు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయిస్తాం

సభలో వాకౌట్ అనంతరం పలువురు వైసిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఏ పార్టీ నుంచి గెలిచిన ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన మాటలకు చేసిన పనులకు పొంతనలేదని విమర్శించారు. వైసిపి ప్రజాపతినిధులకు ప్రభుత్వం అన్ని విధాల ఆటంకాలు సృష్టిస్తుందని అన్నారు. తమ హక్కులు కాపాడేందుకు కలెక్టర్‌కు, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు. నాయకులు బి.మోహన్‌రెడ్డి, బాబూరావు, రాములమ్మ, బి.సుధాకర్, రాజ్యలక్ష్మి, వీరాస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ


పొందూరు: విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వసుంధర, మెళియాపుట్టిలో బుధవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం వద్దకు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని వెళ్లి అవసరమైన విత్తనాలు రాయితీపై పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ పోలాకి జై.మునిరావు, సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, వ్యవసాయ అధికారి త్రివేణి పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలోని మేఘవరం రైతు సేవా కేంద్రంలో మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, మేఘవరం మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గంట లోకేష్, మాజీ సర్పంచ్‌లు మేరుగు నూకయ్య, వంక సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుందని టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్ అన్నారు. పొందురులో వరి విత్తనాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోనే విత్తనాలు విక్రయిస్తామన్నారు. అనంతరం వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, ఎంపిటిసి ప్రతినిధి బాడాన గిరి, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, డి.రవి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగదు, బంగారు వస్తువులను అందజేస్తున్న పోలీసులు

పోలీసుల చాకచక్యం

పాతపట్నం : మండలంలోని ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నారు. మండలంలోని సింగుపురానికి చెందిన మువ్వల లక్ష్మీనారాయణ తన కుటుంబంతో పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్‌లో ఆటో ఎక్కారు. సింగుపురంలో దిగిన సమయంలో ఆటోలో బ్యాగ్‌ను మర్చిపోయారు. బ్యాగ్‌లో రూ.20 వేలు, నగదు, బంగారు చెవి దుద్దులు ఉన్నాయి. తరువాత బ్యాగ్ మరిచిపోయిన విషయం గుర్తించి లక్ష్మీనారాయణ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ రామకృష్ణ సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. ఆటో పర్లాకిమిడికి చెందిన సింహాద్రిగా గుర్తించారు. అనంతరం ఆటోడ్రైవర్‌ను పిలిచి నగదు, బంగారం వస్తువులను అందజేశారు. కానిస్టేబుల్‌ను సిఐ రామారావు అభినందించారు.

శ్రీకాకుళం సిటీ : ఆర్థికసాయం అందజేస్తున్న సంఘ నాయకులు

పలువురు ఆర్థికసాయం

శ్రీకాకుళం సిటీ : చిక్కోలు సొండి సంక్షేమ సంఘం సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న రత్నాల సింహాచలంకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, విజయనగరం నుంచి రత్నాల బాలకృష్ణ, శ్రీకాకుళం సంఘ అధ్యక్షులు నల్లాన మధుప్రకాష్, ప్రధాన కార్యదర్శి రత్నాల జగన్మోహనరావు, కోశాధికారి షావుకారి గోపాలరావు, సంఘ గౌరవాధ్యక్షులు రత్నాల వరప్రసాద్ శ్రీకాకుళం మీనాక్షి ఆస్పత్రికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు.

ఇచ్ఛాపురం : సీతయ్య ఫౌండేషన్ అనాథాశ్రమానికి పట్టణానికి చెందిన ఎలియన్స్ క్లబ్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. రూ.పది వేలు నగదు, రూ.పది వేలు విలువైన నిత్యావసర వస్తువులు, బిస్కెట్, చాక్లెట్, బ్రెడ్స్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, వెంకటరమణ, ఉమాశంకర్, ఎస్ఐసి బుజ్జి, సత్యమయ్య, రామారావు, యోగి, నరసింహమూర్తి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, రవి, శ్రీను, వెంకటరమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సరుకులను పంపిణీ చేస్తున్న సభ్యులు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తమ మిత్రుడు నెల్లూరు శ్రీకాంత్, శృతిలకు చెందిన ఆరు నెలల వయసు ఉన్న చిన్న కుమార్తె లవిత్రశ్రీ కాలేయ మార్పిడి కోసం రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకుని రూ.93,500 నగదుని విరాళంగా పోగుచేసుకుని బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు.